క్లుప్తంగా

సహకార శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

పెనమలూరు: సహకార శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని విజయవాడ సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ ఎం.రామమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పోరంకిలో వివరాలు తెలుపుతూ ఏపీ రాష్ట్ర సహకార యూనియన్ తొమ్మిదో బ్యాచ్ డిప్లమో ఇన్ కో-ఆపరేటివ్ మేనేజిమెంట్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్-2024 కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోందని తెలిపారు. ఈ కోర్సులకు 40 సీట్లు ఉన్నాయని, కోర్సు వ్యవధి ఆరు నెలలని అన్నారు. శిక్షణ కేంద్రం పరిధిలోని జిల్లాలైన కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, పశ్చిమ గోదావరి, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిలాల్లోని సహకార సంఘాల్లో పని చేస్తున్న అభ్యర్థులు శిక్షణకు రావచ్చని వివరించారు. సంఘాల్లో పని చేస్తున్న వారికి కనీస విద్యార్హత 10వ తరగతి, ఇతరులకు ఇంటర్ అని తెలిపారు. జులై 2వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, మరిన్ని వివరాలకు 9966341988, 9440374578 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సేంద్రియ ఎరువులనే వినియోగించాలి



రామవరప్పాడు: రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులనే రైతులు వినియోగించాలని డీఆర్సీ, ఏడీఏ పి.మౌనిష అన్నారు. విజయవాడరూరల్ మండలం గూడవల్లిలో శుక్రవారం డిస్ట్రిక్ రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారుమడి, కలుపు, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. భూసార పరీక్ష ప్రాముఖ్యత, పచ్చిరొట్ట ఎరువుల విశిష్టతపై రైతులకు విశ్లేషాత్మకమైన వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రంగనాథ్ బాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పెనమలూరు పంచాయతీపై విచారణకు ఆదేశం

పెనమలూరు: పెనమలూరు గ్రామ పంచాయతీలో కాంట్రాక్టు కార్మికుల విషయమై విచారణ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వి.నాగేశ్వర్ నాయక్ శుక్రవారం ఆదేశించారు. గ్రామానికి చెందిన ఎం.బదిరినారాయణ, సీహెచ్ శ్రీనివాస్ కాంట్రాక్టు కార్మికులు విధులకు హాజరు అవ్వకపోయినా జీతాలు చెల్లించారని ఆరోపిస్తూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై గుడివాడ డీఎల్పీవో, పెనమలూరు ఈవోపీఆర్డీ, చల్లపల్లి కార్యదర్శిని ఆరోపణలపై విచారణ చేసి నివేదిక సమర్పించాలని డీపీవో ఆదేశించారు.

బస్టాండు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

కంకిపాడు: బస్టాండు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని టీడీపీ నేత యలమంచిలి కిషోర్‌బాబు కోరారు. ఈ మేరకు సీఎం నారా చంద్రబాబు నాయుడుకు మీ కోసం పోర్టల్‌లో శుక్రవారం వినతిపత్రం పంపారు. కిషోర్ బాబు మాట్లాడుతూ కంకిపాడు పట్టణంలోని ప్రధాన సెంటరులో ఉన్న బస్టాండు ప్రాంగణం చిన్న వర్షానికే మునిగిపోయి రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాలనా యంత్రాంగం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, ఇబ్బందులు తొలగించాలని కోరారు.

అభయాంజనేయస్వామి సన్నిధిలో ఏలూరు ఎమ్మెల్యే



హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామివారిని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ (చంటి) దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్, అర్చకులు ఆయనకు సాదరస్వాగతం పలికారు. తొలిసారి శాసనసభ సమావేశాలకు హాజరై ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత అభయాంజనేయస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే రాధాకృష్ణ దంపతులు హనుమంతునికి తమలపాకుల అర్చన, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు ఎమ్మెల్యేకు స్వామివారి శేషవస్త్రాలు, చిత్రపటం బహూకరించి ఆశీర్వచనాలు అందజేశారు.

అంగన్‌వాడీ బడిబాట

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌లో శుక్రవారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం జరిగింది. అంగన్‌వాడీ సెంటర్‌లో అందించే సేవలపై అవగాహన కల్పించారు. గర్భిణీలు, ఐదేళ్లలోపు చిన్నారులు అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌లో విద్య పూర్తిచేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందజేసి పాఠశాలలకు పంపించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

కంకిపాడు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నలంద విద్యానికేతన్ విద్యా సంస్థల సీఏసీ ఎల్.సుధారాణి, ప్రిన్సిపాల్ పి.నాగలక్ష్మి అన్నారు. ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్ వసంత క్యాంపస్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగాతో ఏకాగ్రత, మానసిక ప్రశాంతత చేకూరుతాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలతో అబ్బురపరిచారు. గోసాల హెచ్ఎంకే పాఠశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుక్‌మిత్ కౌర్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు ప్రదర్శించారు. డైరెక్టర్ వసంత్‌కుమార్ పర్యవేక్షించారు. ఈడుపుగల్లు మోడల్ స్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయుడు మండవ శ్రీనివాస్ విద్యార్థులకు వృక్షాసనం వేశారు. పలు ఆసనాలు, వాటి ప్రయోజనాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో వైద్య సహాయకురాలు ఝాన్సీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆయుష్‌శాఖ పర్యవేక్షణలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో కోలవెన్ను గ్రామ ఎంపీపీ, జెడ్పీటీసీ పాఠశాలల విద్యార్థులు పాల్గొని యోగాసనాలను వేశారు. కోలవెన్ను ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ నీలిమ, యోగా శిక్షకురాలు శ్రావణి పర్యవేక్షించారు.

పెనమలూరు: పెనమలూరు మండలంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీవెంకటేశ్వర సేవా కేంద్రం ఆధ్వర్యాన విద్యార్థులు యోగా చేశారు. పాఠశాలలో దాదాపు 800 మంది విద్యార్థులు యోగాలో పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.దుర్గాభవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో యోగా దినోత్సవం చేశారు. క్లాసికల్ యోగా టీచర్ హరిచందన విద్యార్థులతో యోగా చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, వారు మానసిక ఒత్తిడికి గురి కాకుండా ఉండటానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అనంతరం హరిచందనను అధ్యాపక బృందం ఆత్మీయంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, డిప్లమో ఇన్‌చార్జి హేమ, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే పోరంకిలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు గొపిశెట్టి దుర్గాప్రసాద్ ఆధ్వర్యాన ఉషోదయ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరిగింది. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 195 దేశాల్లో యోగా దినోత్సవం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, టీడీపీ నేత అనుమోలు ప్రభాకరరావు, యోగా గురువు ఈశ్వర్, ఉషోదయ కరస్పాండెంట్ యార్లగడ్డ రాజబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కానూరులో...

కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ కౌన్సిల్ సభ్యుడు కె.సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు తమ తమ రంగాల్లో రాణించడానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందికి ఆసనాలు, ప్రాణవాయువు, ధ్యాన పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, డీన్ బావినేని పాండురంగారావు, ప్రొఫెసర్లు చావా శ్రీనివాస్, కొల్లా నరేంద్ర, వి.మల్లికార్జునరావు, ఎస్.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు. కానూరు కేసీపీ సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలలో కూడా యోగా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మనోజ్ కర్మాకర్ మాట్లాడుతూ యోగా చేయడం వల్ల విద్యార్థుల్లో ఉత్సాహం, క్రమ శిక్షణ ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు పలు ఆసనాలతో యోగా చేశారు. వైస్ ప్రిన్సిపాల్ సాయికృష్ణ, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు యోగాసనాలు, పిరమిడ్ ధ్యానం, యోగా సాధన చేశారు. అనంతరం శ్రీవెంకటేశ్వర యోగా కేంద్రం ఆధ్వర్యంలో వెంకటకృష్ణ, తులసీకృష్ణ, మురళీకృష్ణల శిష్య బృందం వారు విద్యార్థులచే పలు రకాల యోగాసనాలు చేయించారు. రోజూ ఆసనాలు వేయడం వల్ల కలగే ప్రయోజనాలు, యోగా గొప్పదనాన్ని వివరించారు. అనంతరం శిష్య బృందం వారు పలు యోగాసనాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు శేఖర్, దుర్గాప్రసాద్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో శుక్రవారం 3(ఎ) ఆర్ అండ్ వీ ఎన్‌సీసీ వింగ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరిగింది. ఎన్‌సీసీ క్యాడెట్లు గుర్రాలపై చేసిన యోగాసనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ.. వ్యక్తిగత ఎదుగుదలకు, సామాజిక అభివృద్ధికి యోగా సాధనంగా నిలుస్తుందన్నారు. ఎన్‌సీసీ వింగ్ జేసీఓ సుందర్ సింగ్, కళాశాల ఏఎన్ఓ డాక్టర్ జయబాల్, సిద్ధార్థ, ఆంధ్ర లయోలా కళాశాలల ప్రతినిధులు బాలాజీ, ఎలీషా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఎ.జగదీష్‌బాబు, డాక్టర్ బి.ఈశ్వరరావు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. ప్రిన్సిపాల్ ఎ.పద్మావతి పాల్గొన్నారు. అలాగే ఆర్యవైశ్య కల్యాణ మండపంలో స్ఫూర్తి కుటుంబం, మానవత సేవా సంస్థ, వాకర్స్ అసోసియేషన్, మండల న్యాయ సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. శారీరక, మానసిక రుగ్మతల నుంచి విముక్తి కోసం ప్రతి ఒక్కరూ యోగా చేయాలని ప్రిన్సిపల్ సివిల్ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ సిహెచ్.శ్రీనివాస్‌బాబు సూచించారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్, మానవతా నిర్వాహకులు ఎం.బాలకృష్ణమూర్తి, స్ఫూర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక రోటరీ ఆడిటోరియంలో బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో యోగా దినోత్సవం జరిగింది.

ఉంగుటూరు: శారీరక, మానసిక సంపూర్ణ ఆరోగ్యానికి యోగాభ్యాసం సులువైన సాధనమని ఉషా రామ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీకే ఎస్వీ ప్రసాద్ అన్నారు. కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ సేవా విభాగం ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులు వివిధ రకాల యోగాసనాలను ప్రదర్శించారు. రామకృష్ణ యోగా ప్రదర్శనకు నాయకత్వం వహించారు. తేలప్రోలులో ఉపాధి హామీ పథకం కూలీలతో కలిసి ఎంపీపీ వడ్లమూడి సరోజిని, సర్పంచ్ లాం దిబోర యోగా నిర్వహించారు. ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన యోగా కార్యక్రమంలో ఎంఈఓ-2 జి.సాంబశివరావు పాల్గొన్నారు.



ఈడుపుగల్లు నలంద పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



గన్నవరం వెటర్నరీ కళాశాలలో విద్యార్థుల యోగాసనాలు



గంగూరులో యోగా టీచర్ హరి చందనను సన్మానిస్తున్న అధ్యాపకులు



నిడమానూరులో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



ఉషారామలో యోగాభ్యాసం చేస్తున్న విద్యార్థులు



తేలప్రోలులో ఉపాధి కూలీలతో ఎంపీపీ సరోజిని

యోగాసనాలతో బహుళ ప్రయోజనాలు



ఎనికేపాడులో యోగాసనాలపై అవగాహన కల్పిస్తున్న యోగా గురువు సురేష్‌రెడ్డి

రామవరప్పాడు: యోగాసనాలు వేయడం వల్ల బహుళ ప్రయోజనాలు కలుగుతాయని ఇషా ఫౌండేషన్ తరుపు యోగా టీచర్ సురేష్‌రెడ్డి అన్నారు. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని విజయ ఫార్మసీ మహిళా కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ మానవ శరీరం, మనస్సు, భావోద్వేగాలు, జీవశక్తిని మనకు కావాల్సిన విధంగా మార్చుకోవడానికి యోగా ఒక బృహత్తర కార్యక్రమని అన్నారు. అనంతరం పలు యోగాసనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పద్మలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా అందరి జీవన విధానం కావాలి



వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలలో విద్యార్థులకు యోగా నేర్పిస్తున్న ప్రిన్సిపాల్

గన్నవరం రూరల్: యోగా మన జీవన విధానం కావాలని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి ఆకాంక్షించారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని పాఠశాలలో ఆమె విద్యార్థులకు యోగా నేర్పించారు. మహర్షి పతాంజలి యోగా విధానాన్ని అందించారని వివరించారు. గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం కెఎస్.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాలో పాల్గొన్నారు. ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు సూర్య నమస్కారాలు, యోగా ఉపయోగాలు వివరించారు. సావరగూడెం గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, ఉపాధి హామీ కూలీలతో కలిసి యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచ్ అట్ల నాగేశ్వరరావు, ఉపాధి ఎఫ్ఏ సుజాత పాల్గొన్నారు.



గుర్రాలపై నిలబడి యోగాసనాలు చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు



పెనమలూరు జిల్లా పరిషత్ పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థినులు

నేటి నుంచి రూరల్ మండలంలో సోషల్ ఆడిట్



సమావేశంలో మాట్లాడుతున్న స్టేట్ రీసోర్స్ పర్సన్ సూర్యనారాయణ

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలోని గ్రామాల్లో గత ఏడాది జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో జరిగిన అభివృద్ధి పనులు, కూలీల వేతనాలపై సోషల్ ఆడిట్ శనివారం నుంచి నిర్వహించడం జరుగుతుందని స్టేట్ రీసోర్స్ పర్సన్ సూర్యనారయణ అన్నారు. సోషల్ ఆడిట్ నిర్వహణపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి నెలాఖరు వరకు పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఈజీఎస్ శాఖలకు సంబంధించి 8 కోట్ల ఒక లక్ష 40 వేల రూపాయలను ఖర్చు చేసి 284 పనులు జరిగాయన్నారు. వీటికి సంబంధించి గ్రామాల్లో రీసోర్స్ పర్సన్స్ ద్వారా సోషల్ ఆడిట్ నిష్పక్షపాతంగా జరుగుతుందని అన్నారు. సంబంధిత అధికారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇదే సందర్భంలో సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ, సదరన్ సర్టిఫికెట్లు జారీ చేసిన విధానంపై కూడా తనిఖీలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో ఈఓఆర్డీ బీఎల్‌వీ శేషగిరిరావు, పంచాయతీరాజ్ ఏఈ ఎస్.శివరామకృష్ణ, ఉపాధి హామీ పథకం ఇంజినీర్ కన్సల్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

వీరపనేనిగూడెంలో మలేరియా నివారణ ప్రచార ర్యాలీ

గన్నవరం రూరల్: మలేరియా నివారణలో అందరూ భాగస్వాములు కావాలని ఆత్కూరు పీహెచ్‌సీ సబ్ యూనిట్ అధికారి వెంకటరాజు రాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు సూచించారు. వీరపనేనిగూడెం గ్రామంలో శుక్రవారం మలేరియా వ్యతిరేక ప్రచార ర్యాలీలో పాల్గొని మాట్లాడుతూ దోమలు పెరగకుండా అందరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వ ఉండే ప్రతి వస్తువును దూరంగా పెట్టాలన్నారు. చెత్తను దూరంగా పారబోయాలని సూచించారు. మలేరియా మాసోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 17 గదులకు మాలతీన్ మందును స్ప్రే చేయించారు. వసతి గృహంలో ఉంటున్న కిశోర బాలికలు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, జ్వరాలు రాకుండా పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి, ఏఎన్ఎం అనిత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య శాఖ అధికారులు, విద్యార్థులు

ఉత్సాహంగా ఏరువాక పౌర్ణమి



రంగన్నగూడెంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఏరువాక పౌర్ణమిని రైతులు ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. రంగన్నగూడెం, కొత్త వేలేరు గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతాంగం ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఎద్దులను పూలతో ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఎద్దులకు నాగలి కట్టి పొలం దుక్కి దున్నారు. ప్రకృతి కరుణించి సాగునీరు పుష్కలంగా లభించాలని, పంట మంచి దిగుబడులు సాధించాలని రైతులు పూజలు చేశారు. ఏపీ సాగునీటి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, రంగన్నగూడెం సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ సభ్యుడు పుసులూరి లక్ష్మీనారాయణ, వేలేరు మాజీ సర్పంచ్ వేములపల్లి శ్రీనివాసరావు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: మధుర స్వరాలశాల ఘంటసాల అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. సినీ సంగీత వారోత్సవాల్లో భాగంగా గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై శుక్రవారం ఘంటసాల సినీ సంగీత విభావరి, ఘంటసాల స్ఫూర్తి సభను నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ ప్రతి తెలుగు వారి గుండెల్లో ఘంటసాల పేరు వినిపిస్తూ ఉంటుందని తెలిపారు. తెలుగు పాట, మాట ఘంటసాల వెంకటేశ్వరరావేనని తెలిపారు. వివిధ సంస్థల ప్రతినిధులు గోళ్ల నారాయణరావు, తటవర్తి సూర్యనారాయణ, డాక్టర్ భాగ్యశ్రీ శింగంశెట్టి చంద్రశేఖర్ సభలో పాల్గొన్నారు. ఒంగోలుకు చెందిన స్వరఝరి సాంస్కృతిక సేవా సమితి సభ్యులు శ్రీదేవి, మస్తాన్‌వలి, టి.శ్రీనివాస్, రామభద్రకుమార్, పూర్ణచంద్ర, చరణ్, అంజుస్వామి, కోట వెంకటేశ్వరెడ్డి ఆపాట మధురాల పేరుతో పలు చిత్ర గీతాలను ఆలపించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

పెనమలూరు: పోరంకి గ్రామ పరిధి విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు అవ్వడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు పాత పోలీస్‌స్టేషన్ రోడ్డుకు చెందిన వి.అరుణ వంట పనులు చేస్తుంది. కాగా గురువారం అరుణ తాడిగడపలో వంట పని ముగించుకుని ఇంటికి వెళుతూ పాత పోలీస్‌స్టేషన్ వద్ద రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి మచిలీపట్నం వెళుతున్న కారు ఆమెను ఢీ కొట్టి ఆగకుండా వెళ్లి పోయింది. ఈ ప్రమాదంలో ఆమెకు కాలు విరిగింది. ఆమెను విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు వికాస్ కళాశాలలో జాబ్‌మేళా

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు నరెడ్ల నర్సిరెడ్డి, సత్యనారాయణరెడ్డి శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 2022, 2023, 2024 సంవత్సరాల్లో ఏదైనా డిగ్రీ, డిప్లమో, బీటెక్, బీ ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని తెలియజేశారు. జాబ్‌మేళాలో పాల్గొనే వారు తమ విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఈ ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం వికాస్ విద్యాసంస్థల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎస్.కిషోర్‌బాబును 9490888445, 9492552636 నంబర్లలో సంప్రదించవచ్చునని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం గ్రామంలోని కేవీఆర్ కాలనీ, పంచాయతీ కార్యాలయం ఏరియా, శివాలయం పల్లాలు, యూనియన్ బ్యాంక్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

పోరంకి సెక్షన్ పరిధిలో

పెనమలూరు: పోరంకి సెక్షన్ పరిధి సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గుణదల ఆపరేషన్స్ ఈఈ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా గ్రామంలోని బీజేఆర్ నగర్, నిడమానూరు రోడ్డు, వసంతనగర్, మహాలక్ష్మీనగర్, సాయినగర్, లక్ష్మీపురంకాలనీ, విష్ణుపురంకాలనీ, ఆర్టీసీ కాలనీ, బందరు రోడ్డు, బ్రహ్మంగారిగుడి ప్రాంతం, రంగా బొమ్మ సెంటర్, సీతాపురంకాలనీ, సాలిపేట, రామాపురంకాలనీ, కరణంగారి బజార్, ప్రభూనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని పేర్కొన్నారు.